
సాక్షి వైఎస్సార్ జిల్లా

సోమవారం । 15 । మే । 2023



కారు టైరు పగిలి చెట్టుకు ఢీ

రాయచోటి - వేంపల్లె ప్రధాన రహదారిలోని రామాపురం మండలం కుమ్మరపల్లె సబ్‌స్టేషన్ సమీపంలో కారు టైరు పగిలి చెట్టును ఢీకొనడంతో ఒకరు దుర్మరణం చెందారు. - 8లో



సత్యమ్మా.. దీవించమ్మా

రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట గ్రామంలో వెలసిన సత్యమ్మతల్లి జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. - 8లో



అరటి రైతు కుదేలు

మార్కెట్‌లో అరటి ధరలు గణనీయంగా పడిపోయాయి. ఇలా ఉంటే పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

భక్త సంజీవరాయుడిని దర్శించుకున్న కలెక్టర్



రంగ మండపంలో సేదతీరుతున్న జిల్లా కలెక్టర్, చిత్రంలో జేసీ, మునిసిపల్ కమిషనర్

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా వీరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయం ఎదురుగా వెలసిన భక్త సంజీవరాయుడిని ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు కుటుంబ సమేతంగా దర్శించుకుని, స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట జాయింట్ కలెక్టర్ జి. గణేష్ కుమార్ , మునిసిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్ , ఆర్‌డీఓ ధర్మచంద్రారెడ్డి ఉన్నారు.

చెన్నకేశవ స్వామి సన్నిధిలో జిల్లా జడ్జి



పుష్పగిరిలో చెన్నకేశవ స్వామి దర్శించుకుంటున్న జిల్లా జడ్జి శ్రీనివాస్ దంపతులు

వల్లూరు : వైఎస్సార్ జిల్లా న్యాయమూర్తి వి. శ్రీనివాస్ దంపతులు వల్లూరు మండలం పుష్పగిరి కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి, సంతాన మల్లేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకున్నారు. ఆదివారం జడ్జి రాకను పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు సుమంత్ దీక్షితులు ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జడ్జి దంపతులు ఆలయాలకు చేరుకుని స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి ఆలయాల విశిష్టతను తెలిపి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

19న గోవాకు ప్రత్యేక బస్సు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ వేసవి కాలంలో కడప నుంచి గోవాకు ప్రత్యేక ఇంద్ర ఏసీ బస్సును ఏర్పాటు చేసినట్లు కడప డిపో మేనేజర్ ఢిల్లేశ్వరరావు తెలిపారు. 19న సాయంత్రం 6గంటలకు కడపలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10గంటలకు గోవాకు చేరుకుంటుందన్నారు. రానూ పోనూ పెద్దలకు రూ.3000, పిల్లలకు రూ.2250 చార్జిగా నిర్ణయించామన్నారు. ఈ యాత్ర 4రోజులు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన ప్రయాణికులు బస్టాండులో గాని, ఆన్‌లైన్ ద్వారా గాని రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

రాజంపేట వాసికి ఆల్ ఇండియాలో 73వ ర్యాంక్



కోట దీపక్

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఆర్‌ఎస్‌రోడ్డుకు చెందిన కోట చంద్రశేఖర్, సుధామణిల తనయుడు కోట దీపక్ కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ లెవల్ ఎగ్జామ్‌లో 73వ ర్యాంకు సాధించారు. ఈ విషయాన్ని ఆయన ఆదివారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఆల్‌ఇండియా స్థాయిలో జరిగే ఈ పరీక్షకు 28 లక్షల మంది హాజరైనట్లు తెలిపారు. 73వ ర్యాంకుతో తాను కస్టమ్స్ ఆఫీసర్ ఎగ్జామినర్‌గా ఎంపికైనట్లు తెలిపారు.

కురుబ సంఘం ఏర్పాటు

రాయచోటిటౌన్ : అన్నమయ్య జిల్లా కురుబ సంఘం ఏర్పాటు చేశారు. రాయచోటి పట్టణంలో ఓ కల్యాణ మండపంలో అన్నమయ్య జిల్లా పరిధిలోని ఆరు నియోజక వర్గాలకు సంబంధించి రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సంఘానికి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా రవిశంకర్ (రాయచోటి). ప్రధాన కార్యదర్శిగా సహదేవ (పీలేరు) లను ఎన్నుకున్నారు.

హ్యాపీ హోం!

క్షణికావేశం వారిపాలిట శాపంగా మారింది. ఖైదీలుగా నాలుగు గోడలకే పరిమితమై జీవనం సాగిస్తున్నారు. మధ్యంతర ఆటు పోట్లు తట్టుకొని ఆత్మ విశ్వాసంతో రాణిస్తున్నారు. శిక్షా కాలంలో శిక్షణ పొందుతూ నైపుణ్యతను పెంచుకుంటున్నారు. మరోవైపు చదువు మార్గ నిర్దేశం చేస్తుందని నమ్మారు. సన్మార్గంలో పయనించేందుకు దోహద పడుతుందని భావించారు. వెరసి వందలాది మంది విద్యాధికులవుతున్నారు. కేంద్ర కారాగారాన్ని తమకు అనువుగా మల్చుకున్నోళ్లకు హ్యాపీ హోంగా మారిన నేపథ్యమిది.



- శిక్షణగా మారుతున్న శిక్షా కాలం
- కేంద్రకారాగారంలో విద్యాకుసుమాలు
- ఎజీలో గోల్డ్ మెడల్స్ సైతం సాధిస్తున్న నేపథ్యం
- అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పట్టా
- ఉపాధి కల్పన దిశగా స్కిల్ డెవలప్‌మెంట్ యూనిట్లు
- ఖైదీలచే ఏపీలో తొలి పెట్రోల్ పంపు నిర్వహణ

సాక్షి ప్రతినిధి, కడప : కడప కేంద్ర కారాగారంలో దాదాపు 609 మంది ఖైదీలున్నారు. వారిలో శిక్ష అనుభవిస్తున్న వారు 411 మంది ఉన్నారు. కేంద్ర కారాగారం అధికారులు ఖైదీల శిక్షా కాలాన్ని శిక్షణగా మారుస్తున్నారు. జైలు జీవితం గడుపుతున్న ఎంతో మందిని విద్యాధికులుగా తీర్చిదిద్దుతున్నారు. సత్ప్రవర్తన నేర్పుతున్నారు. శిక్ష పూర్తి అయ్యాక జనజీవనంలోకి వెళ్లినా ఆదర్శ వంతులుగా జీవించేలా తర్ఫీదు ఇస్తున్నారు. వయోజన విద్యను అందుబాటులోకి తెచ్చారు. చదువు రాని వారికి చదువు నేర్పుతున్నారు. మరోవైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా పట్టభద్రులను చేస్తున్నారు. పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేయిస్తున్నారు. ఇప్పటికే 58 మంది పీజీ పూర్తి చేసిన వారు ఉండగా, 280 మంది డిగ్రీ పట్టా అందుకున్నారు. వీరిలో ముగ్గురు గోల్డ్ మెడల్స్ సాధించిన వారు ఉండడం విశేషం.

అందుబాటులో డిజిటల్ లైబ్రరీ...

కడప కేంద్రకారాగారంలో అబ్బుర పర్చే గ్రంథాలయం ఉంది. ఇప్పటికే 3,925 పుస్తకాలు ఆ లైబ్రరీలో ఉన్నాయి. వ్యక్తిత్వ వికాసం, స్ఫూర్తిదాయకం, హెల్త్ టిప్స్, కథల పుస్తకాలు, వివిధ రచయితల నవలలు అందుబాటులో ఉన్నాయి. ఖైదీల మానసిక ఉల్లాసం కోసం డిజిటల్ లైబ్రరీ కూడా ఏర్పాటు చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే కారాగారంలో ఉన్నామనే మాటే కానీ, ఆ భావన లేకుండా ఉండేందుకు చేపట్టాల్సిన అన్ని చర్యలను అధికార యంత్రాంగం తీసుకుంటోంది. ఖైదీల్లో సత్ప్రవర్తనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు.

గోల్డ్ మెడల్స్ సాధించారు..

డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఎంఏ(సోషియాలజీ) పూర్తి చేసుకున్న ఇద్దరు జీవిత ఖైదీలు గోల్డ్ మెడల్స్ దక్కించుకున్నారు. మరో జీవిత ఖైదీ డిగ్రీలో గోల్డ్ మెడల్ సాధించాడు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం మల్లకాల్వకు చెందిన కామిరెడ్డి సురేష్‌రెడ్డి(38) (సి.టి.నెం. 7644) 2020 సంవత్సరంలో ఎంఏ సోషయాలజీలో గోల్డ్ మెడల్ సాధించాడు. జిల్లాలోని చెన్నూరు గాం.దీనగర్‌కు చెందిన మరో జీవితఖైదీ ఎస్.రమేష్‌బాబు(45) (సి.టి.నెం.6873) 2021లో గోల్డ్ మెడల్ సాధించారు. తిరుపతి జిల్లా ఏర్పేడుకు చెందిన యుగంధర్ డిగ్రీలో గోల్డ్ మెడల్ సంపాదించాడు.



కేంద్ర కారాగారం ప్రాంగణంలో ఉన్న పరిశ్రమ

ఉపాధి కల్పన సైతం..

ఖైదీలకు ఉపాధి కల్పన నిమిత్తం అనేక పారిశ్రామిక మెలకువలు నేర్పుతున్నారు. 2022లో జర్మన్ టెక్నాలజీ మెషనరీతో ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా రూ.5కోట్ల వ్యయంతో ట్రియోవిజన్ ఇంటీరియల్ ఫ్యాక్టరీని నందన్‌రెడ్డి నెలకొల్పారు. అందులో అన్ని రకాల ఇంటీరియల్స్ ఫర్నిచర్ కస్టమర్ కోరుకున్న విధంగా ఖైదీలచే తయారు చేయిస్తున్నారు. ఈ పరిశ్రమలో ఖైదీలకు శిక్షణ ఇవ్వడం, శిక్షా కాలం పూర్తి అయ్యాక స్వయంగా జీవనోపాధి సాధించుకునేలా తర్ఫీదు ఇస్తున్నారు. అలాగే సబ్బులు తయారీ యూనిట్లు 40, స్టీల్ ఫర్నిచర్ యూనిట్లు 63, కార్పెంటర్ యూనిట్లు 4, బ్రిక్స్ యూనిట్లు 27, టైలరింగ్ 32, ఐటీసీఎల్ యూనిట్లు 13 ఉన్నాయి. వీటి ద్వారా ఆదాయం గడించేలా ఖైదీలకు అవకాశం ఏర్పడుతోంది. మరోవైపు ఏపీలో తొలిసారిగా ఖైదీలతో నిర్వహించే పెట్రోల్ పంపు కడపలో ఏర్పాటు చేశారు. అందులో పనిచేసే సత్ప్రవర్తన కల్గిన ఖైదీలకు భృతి అవకాశాలు కల్పిస్తున్నారు. కల్తీ లేని పెట్రోల్ బంకుగా పేరు రావడం విశేషం.

కడప కేంద్ర కారాగారంలో	
ఉన్న ఖైదీలు	609
శిక్ష ఖైదీలు	411
రిమాండ్ ఖైదీలు	138
పీడీ యాక్టు	45
విదేశీయులు	07
అసాంఘిక శక్తులు	04
పౌర రుణగ్రహీస్తులు	04
పీజీ (ఎంఏ సోషియాలజీ) చదువుతున్నవారు	34
డిగ్రీ చదువుతున్నవారు	79
ఇప్పటి వరకూ డిగ్రీ పట్టా పుచ్చుకున్నవారు	280
ఇప్పటి వరకూ పీజీ పట్టా పుచ్చుకున్న వారు	58
గోల్డ్ మెడల్స్ సాధించిన వారు	3

జీవితంలో కుంగిపోరాదు



జీవితంలో అనుకోకుండా ఎలాంటి ఉపద్రవాలు సంభవించినా ఎదుర్కోవాలి. పది, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న వైనం బాధిస్తోంది. మరోమారు కష్టపడి చదివి పరీక్షలకు తర్ఫీదు కావాలి. నా శిక్షా కాలంలో జైలు జీవితాన్ని నేర్పించింది. పీజీ చేసి గోల్డ్ మెడల్ సాధించాను.

– రమేష్‌బాబు, జీవితఖైదీ, గోల్డ్ మెడలిస్టు.

ఖైదీలు విద్యాధికులు కావడం అభినందనీయం



కడప కేంద్ర కారాగారంలో ఖైదీలకు సత్ప్రవర్తనతో పాటు విద్యాధికులుగా తీర్చిదిద్దడం అభినందనీయం. మొదట రాజమండ్రిలో మాత్రమే ఎంఏ సోషియాలజీ ఉండగా, కడపకు కూడా అవకాశం కల్పించాం. సోషియాలజీతోపాటు, ఖైదీలకు సైకాలజీ సబ్జెక్ట్ కూడా ఉపయోగమే. రీసోర్స్ పర్సన్, లేబొరేటరీ జైళ్ల విభాగం ఏర్పాటు చేసుకుంటే అనుమతులు ఇచ్చేందుకు సిద్ధమే.

– ఎల్వీ కృష్ణారెడ్డి, డైరెక్టర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ.

విద్య, వ్యక్తిగత నైపుణ్యం పెంపొందిస్తున్నాం



ఖైదీల్లో సత్ప్రవర్తనతోపాటు అర్హత ఉన్నవారిని విద్యాధికులుగా మార్చడం, వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించే చర్యలు తీసుకుంటున్నాం. సమాజంలో ఇబ్బంది పెట్టినోళ్లు మాత్రమే జైలుకు వస్తారు. అలా వచ్చిన వారిని సరిదిద్ది పంపుతున్నాం. శిక్ష ఖైదీల్లో పరివర్తన తెస్తూనే, ఉన్నత చదువులు చదివిస్తున్నాం. మరోవైపు కుటుంబ పోషణ కోసం వివిధ పనులు కల్పిస్తున్నాం. రోజుకు రూ.200 ప్రకారం చెల్లిస్తున్నాం.

– ఐఎస్‌హెచ్ ప్రకాష్, సూపరింటెండెంటు, కేంద్ర కారాగారం.

భానుడి ప్రకోపం.. జాగ్రత్తలతోనే పదిలం

- నేడు, రేపు వాతావరణం పొడిగా ఉండే అవకాశం
- జిల్లాలో రాత్రి ఉష్ణోగ్రతలు సైతం పెరుగుదల
- మరో రెండు రోజులు 2 నుంచి 4 డిగ్రీలు పెరగనున్న ఉష్ణోగ్రతలు
- ఉదయం 10 గంటల నుంచే భగభగమంటున్న ఎండలు
- జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు



ఉదయం 10 గంటలకే భగభగమంటున్న భానుడు

కడప అగ్రికల్చర్ : భానుడు గత నాలుగైదు రోజుల నుంచి మళ్లీ భగభగమంటున్నాడు. పగటిపూటతోపాటు రాత్రిపూట ఉష్ణోగ్రతలు సైతం పెరిగాయి. దీంతోపాటు వడగాల్పులు వీయడం ప్రారంభమైంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు పెరగడంతో సెగలు కక్కుతున్నాయి. జిల్లాలో ఈ పరిస్థితి గత నాలుగైదు రోజుల నుంచి కొనసాగుతోంది. ఉదయం 10 గంటల నుంచే భానుడు భగభగమంటూ వస్తుండటంతో జనం వేడికి అల్లాడి పోతున్నారు. మధ్యాహ్నానికంతా రోడ్లన్నీ జనాలు లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. పగటిపూట పనుల మీద తిరిగే జనాలు, పొలాల్లోకి పనులపైన వెళ్లే రైతులు ఎండల తీవ్రతతో పాటు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. కొంతమంది ఎండ వేడికి తట్టుకోలేక గొడుగులను, మరికొంతమంది టోపీలను పెట్టుకుని ఎండతీవ్రత నుంచి తప్పించుకుంటూ తిరుగుతున్నారు. ఈ సీజన్‌లో ఇటీవలే అత్యధికంగా పగటి ఉష్ణోగ్రత 40.6 డిగ్రీలు దాటింది. మళ్లీ ప్రస్తుతం పగటితోపాటు రాత్రి ఉష్ణోగ్రతలు కూడా క్రమేపీ పెరుగుతున్నాయి. వీటి ప్రభావాన్ని తగ్గించుకునేందుకు ప్రజలు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

నేడు, రేపు పొడిగా వాతావరణం

జిల్లా వ్యాప్తంగా సోమ, మంగళవారాల్లో వాతావరణం పొడిగా మారడంతోపాటు గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమేపీ 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరగవచ్చని కృషి విజ్ఞానకేంద్రం వాతావరణ శాస్త్రవేత్త స్వామి చైతన్య తెలిపారు. జిల్లా ప్రజలు ఎండ, వడగాల్పుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎండలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు


- బయటకు వెళ్లేటప్పుడు ఎండ తీవ్రతను తప్పించుకునేందుకు తప్పని సరిగా గొడుగు లేదా టోపీ వాడాలి
- తెలుపురంగు, పలచటి వస్త్రాలతోపాటు లూజుగా ఉన్న దుస్తులనే వేసుకోవాలి
- ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య అవసరమైతే తప్ప ఆరుబయట తిరగకూడదు
- వీలైనన్ని సార్లు నీరు తాగాలి. ఎండలో తిరిగే సమయంలో కొబ్బరినీరు, మజ్జిగ వంటి ద్రవాలు ఎక్కువగా తీసుకోవాలి. అలాగే నీటిలో నిమ్మరసం, కాస్తంత ఉప్పు కలిపిన ద్రావణాన్ని కూడా అప్పుడప్పుడు తీసుకుంటే మంచిది.
- ఎండలో బయటకు వెళ్లినప్పుడు తల తిరగడం, వికారం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్యులను సంప్రదించి తగిన సూచనలు, సలహాలను పాటించాలి.

జిల్లాలో గత ఐదు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రత వివరాలు

తేదీ	కనిష్టం	గరిష్టం
10.05.23	26.6	38.6
11.05.23	28.9	39.9
12.05.23	27.2	39.4
13.05.23	29.5	39.7
14.05.23	29.7	38.5

హనుమా..పూజలు గైకొనుమా





గండిలో హనుమజ్జయంతి వేడుకలు, కడప రాజరాజేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకరణ

చక్రాయపేట : జిల్లాలో హనుమజ్జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం పూర్ణాహుతితో ముగిశాయి. ఆలయ సహాయ కమిషనర్ ఆలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన, ఉప ప్రధాన ముఖ్య అర్చకులు కేసరి రాజారమేష్, రాజగోపాలాచార్యులు, రఘుస్వామి, వేద పారాయణం రామ మోహన్ శర్మలు ఈ కార్యక్రమాలను నిర్వహించారు ఈ వేంపల్లె జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్ రెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు ఈశ్వరరెడ్డి, రెడ్డెయ్యలతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. హనుమజ్జయంతి సందర్భంగా చింతకొమ్మదిన్నె మండలం,తాడిగొట్లకు చెందిన ఓబుళరెడ్డి, సుబ్బారెడ్డిలతో పాటు ఆలయం తరపున పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

అంజన్నకు ఆర్యవైశ్య సంఘం తరపున పట్టువస్త్రాలు

గండి ఆర్యవైశ్య అన్నదాన సత్రం తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అన్నదాన సత్రం వద్ద నుంచి మంగళ వాయిద్యాల మధ్య వస్త్రాలు తెచ్చి మహిళలు అందజేశారు

లోక్ అదాలత్‌లో 12,897 కేసులకు పరిష్కారం

కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లాకు ఐదో స్థానం

కడప అర్బన్ : జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 22 బెంచీల ద్వారా 12897 కేసులకు పరిష్కారం లభించడంతో కక్షిదారులకు రూ.18,97,76,833 నష్ట పరిహారం ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేశారు. కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో జిల్లా ఐదో స్థానంలో నిలిచింది. వీటిలో 10486 క్రిమినల్ కేసులు, 243 సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు 2168 పరిష్కారమయ్యాయి. కడప కోర్టులో 5195 కేసులు, ప్రొద్దుటూరులో 917, రాజంపేటలో 671, రాయచోటి కోర్టులో 771, బద్వేల్‌లో 2357, లక్కిరెడ్డిపల్లెలో 246, రైల్వేకోడూరులో 221, నందలూరులో 530, సిద్దవటం కోర్టులో 188, జమ్మలమడుగు కోర్టులో 1151, పులివెందులలో 348, కమలాపురం కోర్టులో 302 కేసులు జాతీయలోక్ అదాలత్‌లో పరిష్కరించారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేసిన న్యాయవాదులకు, రెవెన్యూ, పోలీసు, వివిధ శాఖల అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్‌ఎస్‌ఏ చైర్మన్ వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, జడ్జి ప్రదీప్‌కుమార్‌లు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

6430 క్రిమినల్ కేసులకు పరిష్కారం

జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా వైఎస్‌ఆర్ జిల్లా వ్యాప్తంగా 6430 క్రిమినల్ కేసులను పరిష్కరించి రాష్ట్రంలోని 28 పోలీసు జిల్లాలలో 7వ స్థానంలో నిలిచినట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. ఇందుకు కృషి చేసిన పోలీస్ అధికారులు, కోర్టు ప్రాసెస్, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ సెల్ విభాగ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మెగా లోక్ అదాలత్‌లో 938 ఐపీసీ కేసులతో పాటు, ఎక్సైజ్, ఇతర పెట్టీ కేసుల్లో నేరాలు ఒప్పుకున్నందున చట్టాన్ని ఉల్లంఘించిన వారికి జరిమానా విధించారు.

నేటి నుంచి ఈఏపీసెట్

- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ
- 15 నుంచి 19 వరకు ఎంపీసీకి, 22, 23న బైపీసీ స్ట్రీమ్ వారికి ఆన్‌లైన్ పరీక్షలు
- జిల్లావ్యాప్తంగా 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌లో పరీక్షలు
- 15,333 మంది ఇంజినీరింగ్‌కు, 7783 మంది అగ్రికల్చర్, ఫార్మసీ అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



కడపలో పరీక్ష కోసం సిద్ధం చేసిన కంప్యూటర్ ల్యాబ్

కడప ఎడ్యుకేషన్ : ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష(ఏపీఈఏపీసెట్)– 2023 సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఈ పరీక్షలను కంప్యూటర్ ఆధారిత(ఆన్‌లైన్) విధానంలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. ఇంజినీరింగ్ స్ట్రీమ్ (ఎంపీసీ) విద్యార్థులకు ఈనెల 15 నుంచి ప్రారంభమై 19వ తేదీ వరకు పరీక్ష జరగనుండగా, అగ్రికల్చర్, ఫార్మసీ(బైపీసీ) విద్యార్థులకు 22, 23 తేదీలలో జరగనున్నాయి. ఇందులో ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు సెషన్స్‌లో పరీక్ష జరగనుంది. ఇందుకు సంబంధించి వైఎస్సార్ జిల్లాలో 9 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. 15,333 మంది ఇంజినీరింగ్‌కు, 7783 మంది అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షను ఆన్‌లైన్‌లో రాయనున్నారు. ఉదయం సెషన్ 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం సెషన్ 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనుంది.

జిల్లాలో తొమ్మిది పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

ఈఏపీసెట్ పరీక్ష కోసం జిల్లాలో తొమ్మిది కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో కడపలో అన్నమాచార్య, స్విస్ట్, కేఎస్‌ఆర్‌ఎం, కేఓఆర్‌ఎం, శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. ఈ ఐదు పరీక్షా కేంద్రాలలో ఇంజినీరింగ్‌కు సంబంధించి 8506 మంది, అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించి 4078 మంది పరీక్షలు రాయనున్నారు. అలాగే ప్రొద్దుటూరులో సీబీఐటీ, సాయి రాజేశ్వరి, వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఇంజినీరింగ్‌కు సంబంధించి 5093 మంది, అగ్రికల్చర్, ఫార్మసీకి 2661 మంది పరీక్ష రాయనున్నారు. అలాగే రాజంపేటలో అన్నమాచార్య కళాశాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఇంజినీరింగ్‌కు సంబంధించి 1734 మంది, అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించి 1044 మంది పరీక్ష రాయనున్నారు. ఇలా మొత్తంగా 9 పరీక్షా కేంద్రాల్లో ఇంజినీరింగ్‌కు 15,333 మంది, అగ్రికల్చర్, ఫార్మసీకి 7783 మంది పరీక్షలను రాయనున్నారు.

రెండు సెషన్స్‌లో ఆన్‌లైన్ పరీక్ష

విద్యార్థులను ఉదయం సెషన్‌కు సంబంధించి 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. మధ్యాహ్నం 3 గంటల పరీక్షకు 1.30 గంటల నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పని సరిగా తీసుకురావాలని అధికారులు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు పరీక్ష రోజే కులధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది.

అన్నమయ్య జిల్లా బండపల్లెలో శిల్పారామం

కడప కల్చరల్ : అన్నమయ్య జిల్లాలో శిల్పారామం ఏర్పాటు కానుంది. మహానేత డాక్టర్ వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రమంతటా శిల్పారామాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా మన జిల్లాలో జిల్లా కేంద్రమైన కడప నగరంతోపాటు పులివెందులలో కూడా శిల్పారామాన్ని ఏర్పాటు చేశారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటయ్యాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ చూపి ఈ జిల్లాలో కూడా శిల్పారామం ఏర్పాటుకు ఆదేశించారు. ప్రజలకు ఆహ్లాదం, ఆనందం పంచేందుకు ఆటవిడుపుగా ఈ శిల్పారామాలకు ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ఆదరణ లభిస్తోంది. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి బండపల్లెలో కూడా స్థానికులకు ఈ అవకాశాన్ని అందించేందుకు శిల్పారామాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం ఇప్పటికే అధికారులు 13 ఎకరాల 18 సెంట్ల స్థలాన్ని శిల్పారామం రాష్ట్ర అధికారులకు అప్పజెప్పేందుకు చర్యలు చేపట్టారు. రూ.9.60 కోట్లతో రాయచోటి రింగ్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారి పక్కనగల స్థలంలో శిల్పారామాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే శిల్పారామం రాష్ట్ర సీఈఓ ఆదేశాల మేరకు రాష్ట్ర శిల్పారామాల ఏఓ మునిరాజు స్థలాన్ని శుభ్రపరిచే పనుల్లో ఉన్నారు. కడప శిల్పారామం ఏఓ శివప్రసాద్ కూడా సహకారాన్ని అందజేస్తున్నారు. హిటాచిలను వినియోగించి ముళ్ల పొదలు, రాళ్లతో నిండి ఉన్న ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచే పనుల్లో ఉన్నారు.



ముమ్మరంగా జరుగుతున్న పనులు

క్లుప్తంగా

పులివెందుల డీఎస్పీగా వినోద్‌కుమార్



పులివెందుల : పులివెందుల డీఎస్పీగా కె.ఎస్.వినోద్ కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల డీఎస్పీ బదిలీలలో భాగంగా పులివెందుల డీఎస్పీగా వినోద్‌కుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పులివెందుల డీఎస్పీగా వినోద్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు ఏలూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ వినోద్‌కుమార్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు శాయశక్తులా కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం మస్తాన్‌వలివీధిలోని చదరంగం హాల్‌లో ఆదివారం నిర్వహించిన అష్రఫ్–ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ చెస్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. రేటింగ్ క్రీడాకారుడు లిఖిత్ 5 రౌండ్లకు గాను 4.5 పాయింట్లు సాధించి చాంపియన్‌గా నిలిచాడు. రెండో స్థానాన్ని మరో రేటింగ్ క్రీడాకారుడు ప్రభుదేవా, మూడో స్థానం వినీల్ పొందారు. 4వ స్థానంలో ప్రదీప్‌చంద్ర, 5వ స్థానంలో పునీత్, 6వ స్థానంలో సాకేత్, 7వ స్థానంలో పృథ్వీ, 8వ స్థానంలో అభిరామన్, 9వ స్థానంలో యాఫియ, 10వ స్థానంలో అశుతోష్ నిలిచారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా చదరంగం సంఘం కార్యదర్శి బి.అనీస్‌దర్బారీ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ ఆర్బిటర్ టి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దౌర్జన్యం

పెద్దతిప్పసముద్రం : మండలంలోని తుమ్మరకుంట పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ శివాల లోకేష్‌రెడ్డిపై దౌర్జన్యం చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీంద్రబాబు ఆదివారం తెలిపారు. సర్పంచ్ స్వగ్రామమైన బొమ్మకపల్లిలోని తమ ఇంటి వద్ద ఉండగా బండమీదపల్లికి చెందిన సుధాకర్, గంగాధర్, మంజునాథ్ మద్యం సేవించి దౌర్జన్యం చేసి దాడికి యత్నించారని పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

అరటి రైతు కుదేలు

- భారీగా తగ్గిన ధరలు
- గత నెలలో టన్ను రూ.25వేలు
- ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను రూ.9వేలు
- లబోదిబోమంటున్న రైతన్నలు



నాగాయపల్లె వద్ద సాగులో అరటి పంట



కొత్తగంగిరెడ్డిపల్లె పొలాల్లో అరటి కాయలను లోడింగ్ చేస్తున్న కూలీలు

పెండ్లిమర్రి : గత రెండు నెలలుగా అరటి రైతులకు సిరుల పంట పండింది. మార్కెట్‌లో అరటి టన్ను రూ.20 వేల నుంచి రూ.25వేలు ధర పలకడంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. రైతుల సంతోషం కేవలం రెండు నెలలు మాత్రమే నిలిచింది. ప్రస్తుతం మార్కెట్‌లో అరటి ధరలు గణనీయంగా పడిపోయాయి. దీనికి తోడు గత నెలలో కురిసిన అకాల వర్షం, ఈదురు గాలులు, వడగండ్ల వానకు అరటి పంట నేలకొరిగి నష్టం వాటిల్లింది. టన్ను రూ.9వేల నుంచి రూ.8వేల లోపు మాత్రమే పలుకుతున్నాయి. ఇలా ధరలు ఉంటే పంటకు పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు లబోదిబోమంటున్నారు. అరటి జిల్లా వ్యాప్తంగా 14,778 ఎకరాల్లో రైతులు సాగు చేశారని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు.

తగ్గిన ధరలు

ఫిబ్రవరి, మార్చి నెలలో అరటి అమ్మకాలు జోరుగా సాగాయి. ప్రస్తుతం ఢిల్లీ మార్కెట్‌లో టన్ను రూ.10వేల నుంచి రూ.9వేలు ధర పలుకుతోంది. లోకల్ మార్కెట్‌తో పాటు చెన్నై, బెంగళూరు, తమిళనాడు మార్కెట్‌లో టన్ను రూ.8వేల నుంచి రూ. 5వేలు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ఎండలకు, వడగాలులకు చెట్లు పడిపోతున్నాయని వారు వాపోతున్నారు.

పెట్టుబడి ఎక్కువ.. ఆదాయం తక్కువ

అరటి రైతులకు ఈ ఏడాది పెట్టుబడికి తగిన ఫలితం వస్తోందని రైతులు ఎంతో ఆశగా ఎదురు చూశారు. కొందరు రైతులకు మంచి లాభాలు వచ్చాయి. ప్రస్తుతం కోత దశలో ఉన్న రైతులకు మాత్రం నిరాశ మిగిలింది. ఒక ఎకరాకు 1300 నుంచి 1400 అరటి మొక్కలు నాటారు. ఒక్కో మొక్క రూ.12 నుంచి రూ.18 పెట్టి కొనుగోలు చేశారు. కూలీలు, ఎరువులు, మందులు, కలుపునకు ఎకరాకు రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. ధరలు మార్కెట్‌లో గణనీయంగా తగ్గిపోవడంతో పంటకు పెట్టిన పెట్టుబడి వచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరలు నిలకడగా ఉండడం లేదు



రెండు నెలల క్రితం టన్ను రూ.25వేలు ఉండేది. ఇప్పుడు రూ.9వేల నుంచి రూ.8వేలకు పడిపోయాయి. మార్కెట్‌లో ధర నిలకడగా ఉండడం లేదు. రైతుల వద్ద వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కెట్‌లో ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. బజారులో అరటి డజన్ రూ.30 అమ్ముతున్నారు. రైతుల వద్దకు వచ్చే సరికి ధరలు పడిపోయాయని చెబుతున్నారు. మార్కెట్‌లో ధరలు ఉన్నా దళారులు రైతులను మోసం చేస్తున్నారు. ఎండలకు అరటి రైతులకు అన్నీ నష్టాలే.

–సుబ్బారెడ్డి, రైతు, నాగాయపల్లె, పెండ్లిమర్రి మండలం

అరటి రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తోంది

అరటి పంట సాగు చేసిన ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకం అందించింది. ఒక రైతుకు గరిష్టంగా హెక్టారుకు రూ.40వేలు వరకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం సాయం అందిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయిలో అరటి పంట సాగు చేసే అందరి రైతులకు ప్రోత్సాహకాలు అందించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. వీటితో పాటు రైతులు పొలాల వద్ద రాయితీకి ప్యాక్ హౌసెస్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు.

–సుభాషిణి, జిల్లా ఉద్యానశాఖ ఏడీ, కడప

సారా స్థావరాలపై ఎస్‌ఈబీ దాడులు

మదనపల్లె/నిమ్మనపల్లె : నిమ్మనపల్లె, మదనపల్లె మండలాల్లో సారా స్థావరాలపై ఎస్‌ఈబీ అధికారులు ఆదివారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 40 లీటర్ల నాటుసారా, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఈబీ ఇన్‌చార్జి సీఐ శ్రీహరిరెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నిమ్మనపల్లె, మదనపల్లెలోని ఎర్రాతివారిపల్లె, సోమానుపల్లె, రెడ్డివారిపల్లె, చిలకవారిపల్లె, కురబలకోట మండలం ఎరుకలపల్లెల్లో నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు నిర్వహించారు. నిమ్మనపల్లె మండలంలోని రెడ్డివారిపల్లెకు చెందిన శివశంకర్ (32), జి.నరేష్ (30), సోమానుపల్లెకు చెందిన తుపాకుల శ్రీరాములు (55) నుంచి 20 లీటర్ల సారాతోపాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మదనపల్లె మండలం చిలకవారిపల్లెలో నాటుసారా విక్రయిస్తున్న టి.ఏసు (30), వై.కళ్యాణ్ (28) వద్ద నుంచి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కురబలకోట మండలం ఎరుకలపల్లెకు చెందిన ఇ.రామకృష్ణ (55), మట్లివారిపల్లెకు చెందిన ఎం.రమణప్ప (50) నాటుసారా సరఫరా చేస్తుండగా అరెస్ట్ చేశారు. వారి నుంచి 45 లీటర్ల నాటుసారా, సారా రవాణాకు వినియోగించిన ద్విచక్రవాహనం, సారా తయారీకి ఉపయోగించే ముడిసరుకు బెల్లం స్వాధీనం చేసుకున్నారు. బెల్లం సరఫరా చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అరెస్ట్ అయిన ఏడుగురు నిందితులను రిమాండ్‌కు తరలించారు.

సత్యమ్మా.. దీవించమ్మా..



ప్రత్యేక అలంకరణలో సత్యమ్మతల్లి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

- కనుల పండువగా జాతర
- 50 ఏళ్ల తర్వాత నిర్వహణ
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

రైల్వేకోడూరు అర్బన్/ఓబులవారిపల్లె : 'సత్యమ్మా.. దీవించమ్మా' అంటూ భక్తులు వేడుకున్నారు. రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట గ్రామంలో వెలసిన సత్యమ్మతల్లి జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. 50 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్న జాతర కావడంతో వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రభుత్వ విప్‌లు కొరముట్ల శ్రీనివాసులు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలతోపాటు సీఎం సలహాదారు ఆర్.ధనుంజయరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజుల నుంచి జాతరను ఘనంగా నిర్వహిస్తున్నారు. గ్రామమంతా విద్యుత్ అలంకరణ, చలువ పందిర్లతో సుందరంగా ముస్తాబు చేశారు. అమ్మవారికి వివిధ రకాల పూలతో శోభాయమానంగా అలంకరించారు. గ్రామస్తులు ప్రత్యేక మేళతాళాలతో వచ్చి పూజలు నిర్వహించారు. ఊరంతా విందు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఉపసర్పంచ్ తోట శివసాయి, పంజం సందీప్‌రెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, బత్తిన శశికుమార్ రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్లు సాయికిషోర్‌రెడ్డి, మందల నాగేంద్ర, వేణుగోపాల్‌రెడ్డి, హేమనవర్మ, జనార్దన్ రాజు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం, చరిత్ర రంగాల్లో 'కట్టా' కృషిని మరువలేం



కట్టా నరసింహులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాయలసీమ టూరిజం సొసైటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : జిల్లాలో సాహిత్య, చరిత్ర రంగాలలో విద్వాన్ కట్టా నరసింహులు కృషిని మరువలేమని యోగి వేమన విశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం సమన్వయకర్త డాక్టర్ కోట మృత్యుంజయరావు కొనియాడారు. కైఫీయత్తుల పరిష్కర్త, సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం తొలి బాధ్యులు కట్టా నరసింహులు రెండవ వర్ధంతిని ఆదివారం కడప నగరంలోని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యాలయంలో నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన సాహిత్య చరిత్రను వెలికి తీయడంలో కట్టా కృషి మరువలేమన్నారు. అనితర సాధ్యమనిపించే కైఫీయత్తుల పరిష్కారం ద్వారా జిల్లాలోని పలువురు మొన్నటితరం కవులు, వారి రచనలు, ఇతర ముఖ్యమైన ఎన్నో చారిత్రక అంశాలను ఆయన నేటి తరానికి అందించారన్నారు. ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయంతోపాటు ఇతర సాహిత్య కార్యక్రమాలతో అనుబంధం ఏర్పడటానికి విద్వాన్ కట్టానే కారణమన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు మాట్లాడుతూ విద్వాన్ కట్టా ప్రోత్సాహం, శిక్షణతోనే కైఫీయత్తులను నేటి తరానికి అర్థమయ్యేలా పుస్తక రూపంలో ఇవ్వగలిగామన్నారు. కట్టా బహుముఖ ప్రజ్ఞను ప్రముఖ టూరిజం ఫొటోగ్రాఫర్ గొబ్బూరు కోటీశ్వరరావు, గంగాధర్ కొనియాడారు. కార్యక్రమంలో విజయ్, నారు నాగరాజు, డేవిడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు గాయపడ్డారు. మదనపల్లె మండలంలోని సీటీఎం పంచాయతీ గంగాపురం గ్రామానికి చెందిన రెడ్డిశేఖర్ (24), నరసింహులు (25) పెయింటర్లుగా పని చేస్తూ జీవిస్తున్నారు. వీరిద్దరూ కలిసి శనివారం రాత్రి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వెళుతుండగా పోతబోలు క్రాస్ వద్ద టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో వారు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు మెరుగైన సేవలకు తిరుపతికి రెఫర్ చేశారు. అలాగే గుర్రంకొండకు చెందిన అహ్మద్‌బాషా భార్య, పిల్లలతో కలిసి గుర్రంకొండ మండలం సంఘసముద్రం గ్రామంలో ఓ శుభకార్యానికి హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం అహ్మద్‌బాషా కుమారుడు అర్హాన్ (8) ఆడుకుంటూ రోడ్డుపైకి రావడంతో అకస్మాత్తుగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడు తీవ్రంగా గాయపడగా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బైక్‌లు ఢీకొని..

బి.కొత్తకోట : ఒకదాని వెనుక ఒకటి వస్తున్న రెండు బైక్‌లు ప్రమాదానికి గురైన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బి.కొత్తకోట మండలం బీరంగికి చెందిన భార్యభర్తలు వెంకటరమణ (60), నారాయణమ్మ (55)లు బైక్‌పై గట్టుకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ఇదే సమయంలో మదనపల్లె నుంచి చంద్రకళ (40), ఆమె భర్త, కుమారుడు బైక్‌పై బి.కొత్తకోటకు వస్తున్నారు. ఈ రెండు బైక్‌లు ఒకదాని వెనుక ఒకటి వెళ్తూ ఈద్గాహ్ దాటిన తర్వాత ప్రమాదానికి గురయ్యాయి. ప్రమాదంలో చంద్రకళకు చేయి విరగ్గా మిగిలిన ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం 108లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గృహిణికి నిప్పు అంటుకుని..

మదనపల్లె : నిప్పంటుకుని గృహిణి తీవ్రంగా గాయపడిన సంఘటన వాల్మీకిపురం మండలంలో జరిగింది. చింతపర్తి పంచాయతీ బోయపల్లెకు చెందిన మల్లయ్య భార్య శారదమ్మ (34) ఉదయం వంట చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పు అంటుకుంది. ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడింది. భర్త వెంటనే గమనించి మంటలను ఆర్పివేసి మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంటలు ఆర్పే క్రమంలో మల్లయ్య కూడా స్వల్పంగా గాయపడ్డాడు. ఔట్‌పోస్టు సిబ్బంది ప్రమాద సమాచారాన్ని వాల్మీకిపురం పోలీసులకు తెలియజేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

శ్రీ శ్రీనివాస I.T.I ప్రొద్దుటూరు
■ 2023–24 సం॥నకు ఎలక్ట్రీషియన్ (80 సీట్లు), డ్రాఫ్ట్‌మెన్ సివిల్ (48 సీట్లు) ట్రేడుల యందు అడ్మిషన్లు జరుగుచున్నవి. చేరుటకు సంప్ర: 9490633112. శిక్షణ–ఉత్తీర్ణత–ఉపాధి మా లక్ష్యం. [C-785980]

PARAMEDICAL
■ B.Sc Nursing, BPT & Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1419]

REAL ESTATE

PLOT FOR SALE
■ తిరుపతి,ఏర్పేడు IIT,IISER స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, అడిడాస్ షూ కంపెనీ, సోమాని టైల్స్, సోలార్ ప్యానల్స్ కంపెనీలతో వేలాది ఉద్యోగ అవకాశాలు వస్తున్న నేషనల్ హైవేకి అనుకొని CC/BT రోడ్స్, ఎలక్ట్రిసిటీ,గేటెడ్ కమ్యూనిటీతో తుడ అప్రూవల్ ప్లాట్లు కలవు. 9848024768. [T-4156]

SERVICE
■ అతి సులభంగా రుణాలు పొందండి. వ్యాపారం ప్రాపర్టీ మార్ట్ గేజ్ వ్యక్తిగత LIC వ్యవసాయ భూమిపై తక్కువ దస్తావేదులతో పొందండి. 9505973750, 8096532189. [T-70]

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-6133]

LADIES HOSTEL
■ కడప మహిళలకు శుభవార్త కేవలం రూ. 2500/- మాత్రమే న్యూబ్రాంచ్ బాలాజీ నగర్,ITI సర్కిల్ దగ్గర నిర్మల లేడీస్ హాస్టల్ వసతి, ఫుడ్, wifi, Cool Mineral water, Hot water 9966889952. [C-784898]

BUSINESS OFFER
■ ట్రేడింగ్ ద్వారా నెలకు లక్ష రూపాయలు సంపాదించుకొనే అద్భుత అవకాశం. Ph: 7013168624 [H-796783]

WANTED
■ G.K.S. Plywood షోరూం నందు పనిచేయుటకు అనుభవం గల వర్కర్స్ కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. ఆకర్షణీయమైన జీతం. ప్రొద్దుటూరు. సంప్ర: 9989434587. [C-785981]

■ WANTED TEACHER'S for 6-10th, Math, Hindi, Eng, Sci, Soci, Pre Pri, Drivers, Aayas, Sal (10 K- 15 K), Kadapa High School, Proddatur. Cell: 9912047939, 9618280816. [C-1161003]

■ పల్లా హాస్పిటల్ 7 రోడ్ సర్కిల్ నందు పని చేయుటకు B.Sc నర్సింగ్ స్టాఫ్(M/F), మరియు వార్డ్ బాయ్స్ కావలెను. సంప్ర: 9849040153. [C-1161239]

■ TEACHERS WANTED To MONTFORT SCHOOL (B.Ed is must), Subject Teachers: for High school in ENGLISH, MATHEMATICS, SCIENCE: Physics, Mail your resume to our email and submit the written application at the earliest in the school office. Interview will be on 19 & 20th May Phone: 7995351591, 9010687003. Email: montfortschool.kadapa@gmail.com, School Bus Drivers Wanted, ADMISSION OPEN. [C-1161243]

■ మా కంపెనీ LED బల్బులు మీ ఇంటివద్దనే ఉండి ఫిట్‌చేసి ఇవ్వడం ద్వారా నెలకి 15,000- 20,000/- వరకు సంపాదించండి. వివరాలకై సంప్ర: 9063132743 [G-786305]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7993583999 [HA-165]

■ మదనపల్లి ఏరియా(CTM) మిల్క్ పరిశ్రమలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Q: Min.10th, A:40 సం. లోపు, డ్యూటీ: 12 గం.లు, జీతం:20,000, ✆ 6281813795. [T-1201285]

■ ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం : 15000 + ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786247]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. Ph: 9848571888 [H-793424]


■ బ్యాంక్స్‌లో పర్మినెంట్‌గా (Office work) ఖాళీలు : 210 Q: 10th-డిగ్రీ, కం॥ఆపరేటర్స్, క్లర్క్స్, అటెండర్స్, ఆఫీస్ అసిస్టెంట్స్, క్యాషియర్స్, PO's జీ॥ 24000/- Ph:7816010774 [H-781424]

■ WANTED FEMALE TELECALLERS and Male Executives. Further Details Contact : 99511 41517, 98498 04431. [NA-11438]

■ DHL International Cargo Courier Servicesలో వర్క్ చేయుటకు క్యాబిన్ ఫ్రంట్ లోడింగ్ full సర్వీసెస్, Office Admin Supervisors, Ground Staff, Team Leaders కావలెను. Q: 10th to any Degree , డిప్లొమా ITI, Age: 18 to 35, Food + Room free. Salary: 25,000/- to 32,000/- Ph: 81255 60645 [B-1165153]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705944423
9705907418
9010223797
9010072409

అంజన్న ఆలయంలో చోరీ



ఆలయంలో చిందరవందరగా పడి ఉన్న వస్తువులు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని కదిరి రోడ్డులో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు పడ్డారు. ఆలయంలో ఉన్న విలువైన వస్తువులు, హుండీలను పగులగొట్టి చెల్లాచెదురుగా పడేశారు. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ దొంగలు చాకచక్యంగా తాళాలు పగులగొట్టి ఆలయంలోకి ప్రవేశించారు. ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా ఆలయాన్ని ఆలయ నిర్వాహకులు అందంగా ముస్తాబు చేశారు. ఆలయంలో విలువైన వస్తువులు, బంగారు అభరణాలు ఉంటాయన్న ఆశతో చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు అంటున్నారు. విలువైన వస్తువులు ఏమీ లేకపోవడంతో.. పెద్దగా నష్టం జరగలేదని వారు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హుండీ నగదు అపహరణ

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామం గుమ్మటం స్వామి దర్గాలో ఉన్న హుండీలోని డబ్బులు చోరీకి గురయ్యాయి. శుక్రవారం రాత్రి దుండగులు హుండీని పగులగొట్టి అందులోని దాదాపు రూ.30 వేలను ఎత్తుకుపోయారని గ్రామస్తులు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

గువ్వల చెరువు ఘాట్‌లో లారీ బోల్తా



క్యాబిన్‌లో ఇరుక్కున్న లారీ క్లీనర్

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌లో నాల్గవ మలుపు వద్ద ఆదివారం లారీ బోల్తా పడింది. ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డి తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాయచోటి వైపు నుంచి బ్యాటరీల లోడుతో కడపకు వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మురళి సురక్షితంగా బయటపడగా, క్లీనర్ మంజునాథ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. దీంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని హైడ్రాలిక్ కట్టర్, స్ప్రెడర్లను ఉపయోగించి క్యాబిన్‌లోని భాగాలు తొలగించారు. క్లీనర్‌ను బయటకు తీసుకొచ్చి రిమ్స్‌కు తరలించారు. డ్రైవర్, క్లీనర్ ఇద్దరూ కర్ణాటకకు చెందినవారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెస్క్యూ ఆపరేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్ వీరన్న, డ్రైవర్ జలీల్, ఫైర్‌మెన్ ప్రతాప్‌రెడ్డి, రమేష్ నాయక్, పవన్ కుమార్‌లు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి



సాత్రి జేమ్స్ (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామంలో శనివారం తెల్లవారుజామున గ్యాస్ సిలిండర్ పేలి గాయాలపాలైన సాత్రి జేమ్స్, ఆయన భార్య సాత్రి మరియమ్మ చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రిలో చేరారు. సాత్రి జేమ్స్ (77) పరిస్థితి విషమించి ఆదివారం సాయంత్రం మృతి చెందినట్లు బంధువర్గాలు తెలిపాయి. సాత్రి మరియమ్మ పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు వారు తెలిపారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం



మృతి చెందిన రామచంద్ర

మదనపల్లె : ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని భవన నిర్మాణ కార్మిక మేస్త్రీ దుర్మరణం చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం మదనపల్లె మండలంలో జరిగింది. పెంచుపాడు పంచాయతీ పాళంవారిపల్లెకు చెందిన పాట్టూరి రామచంద్ర (27) భవన నిర్మాణ కార్మిక మేస్త్రీగానూ, వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంలో సీటీఎంకు వ్యక్తిగత పనులపై వెళ్లేందుకు బయలుదేరాడు. మార్గంమధ్యలోని దుబ్బిగానిపల్లె వద్ద ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనం నుజ్జునుజ్జు అయ్యింది. మృతునికి భార్య నవనిత, కుమార్తె జ్ఞానవిలు ఉన్నారు. శనివారం రాత్రి గ్రామంలో చెన్నకేశవస్వామి జాతర జరిగింది. రాత్రంతా రామచంద్ర ఉత్సవాల్లో పాల్గొన్నాడు. ఉదయాన్నే వ్యక్తిగత పనులపై వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సమాచారం తెలియగానే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధుమిత్రులు ఆసుపత్రికి చేరుకుని విలపించారు.

స్తంభించిన ట్రాఫిక్

ప్రమాదం సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు గంట సేపటి వరకు అక్కడికి రాకపోవడంతో.. రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ జామ్ అయ్యి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించేందుకు ప్రయత్నించగా కొందరు డ్రైవర్లు వారితో గొడవకు దిగి దురుసుగా ప్రవర్తించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కారు టైరు పగిలి చెట్టుకు ఢీ

ఒకరు మృతి, నలుగురికి తీవ్ర గాయాలు

రామాపురం : రాయచోటి – వేంపల్లె ప్రధాన రహదారిలోని రామాపురం మండలం కుమ్మరపల్లె పంచాయతీ పరిధిలోని సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం కారు టైరు పగిలి చెట్టును ఢీకొనడంతో ఒకరు దుర్మరణం చెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ కొండారెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామాపురం మండలం నల్లగుట్టపల్లి గ్రామపంచాయితీ బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఉమ్మడిశెట్టి మునిస్వామి(59) ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తన భార్య, కుమార్తె, అల్లుడు, పిల్లలతో కలిసి గండి ఆంజనేయస్వామిని దర్శించుకొని కారులో తిరిగి ఇంటి వస్తున్నారు. మార్గంమధ్యలోని కుమ్మరపల్లె సబ్‌స్టేషన్ సమీపంలోకి రాగానే కారు టైరు పగిలి వేప చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో మునిస్వామి అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మీకాంతమ్మ, శ్రావణి, పిల్లలు బావేష్, సూర్యంకు తీవ్ర గాయాలు అయ్యాయి. మృతుడి అల్లుడు సత్యనారాయణ కారును నడుపుతున్నప్పటికీ ఎలాంటి గాయాలు కాలేదు. సంఘటన స్థలానికి మండల పోలీసులు చేరుకొని గాయపడిన వారిని 108లో చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.